స్త్రీ స్వేచ్ఛను ఆదర్శంగా తీసుకున్న అతనిలోని మార్పుకి కారణం!

# కరుణ

డా. యం. సుగుణరావు కథ

సుందరం మారిపోయాడు'' ఇదివరకటి సుందరం కాదు. జీవన సముద్రంలో నట్టనడుమ వున్నాడు. అతణ్ణి బాగుచేయుగలిగేది మీరే... వెంటనే వస్తారుగా... కన్నీళ్ళతో అర్థిస్తూ... - కరుణ.

ఆ ఉత్తరం చదివి నేను మామూలు మనిషిని కాలేకపోయాను. ఆమే అలా రాసిందంటే సుందరం ఏ దశలో ఏ రకమైన మార్పు సంభవించిందో ఊహించలేకపోతున్నాను. అతడొక అద్భుతమైన 'సత్యం' నాకెప్పుడూ. అతడితో పరిచయమే విచిత్రంగా జరిగింది.

సరిగ్గా ఐదేళ్ల క్రితం యూనివర్శిటీ ఎం.ఫిల్ కోసం కృషిచేస్తున్న రోజుల్లో కాన్వొకేషన్ హాల్లో జరిగిన సెమినార్‌లో చాలామంది మాట్లాడినా, నాకెవ్వరిదీ మింగుడు పడలేదు. ''సమస్యలు సృష్టించేది మనిషే... స్వేచ్ఛగా, సుఖంగా జీవించడానికి వుండే అవకాశాలు కాలరాచి, శాంతియుత సహజీవనానికి విఘాతం కలిగించుకుంటున్నది మనిషే... అంటూ ఉద్వేగంగా మాట్లాడిన సుందరం వెంటనే నాకు స్నేహితుడయ్యాడు. ఆ రోజుల్లో విశాఖ రోడ్లన్నీ మావే. బీచ్ ఒడ్డున ఎన్నో సాయంకాలాలు వేదాంత, తాత్విక చర్చలలోనే మునిగి తేలేవాళ్లం. మనుషుల మధ్య మానవీయ సంబంధాల స్థానంలో వ్యాపార బంధాలు చోటుచేసుకోవడంపట్ల అతను నిత్యం కలత చెందుతూ వుండేవాడు. అతని మాటలు హృదయంలోంచి నిర్భీతిగా ఎక్కుపెట్టిన బాణాల్లా వుండేవి. మధ్యతరగతి కుటుంబంలో పుట్టి తన తర్వాతి చెల్లెళ్ల పెళ్లి బాధ్యత భుజాలమీదకు వేసుకోవలసిన ఈ మనిషికి ఆదర్శాలు తిండిపెడతాయా అనేవారు బంధువులు. ఎలిమెంటరీ స్కూల్లో టీచరుగా పనిచేసే తండ్రి హఠాత్మరణంతో అతడి చదువు అర్ధాంతరంగా



ముగిసింది. మనిషి తత్వ జిజ్ఞాసమొదలైంది. వైజాగ్‌లోని ఒక ప్రైవేట్ కాలేజీలో లెక్చరర్‌గా జాయిన్ అయ్యాడు. కుటుంబ భారం నెత్తిన పడడంతో సంవత్సరం తిరిగేసరికల్లా చెల్లెళ్లిద్దరి పెళ్లీ జరిపించి తన బాధ్యత తీర్చుకున్నాడు. అలా తన డాక్టరేటు డిగ్రీ చెల్లెళ్ల పెళ్లికి ముడిపడడం ఎంత దురదృష్టమో - అయినా ఆ విషయంలో నిరాశ పడలేదు. అతను రీసెర్చి వదిలేసిన సంవత్సర

కాలంలో చాలా మార్పులు జరిగాయి. మా సహోధ్యాయులు చాలామంది రీసెర్చి వదిలి ఉద్యోగాల్లో స్థిరపడడం జరిగింది. నా ఎం.ఫిల్.కూడా పూర్తయి యూనివర్శిటీలోనే టెంపరరీగా లెక్చరర్ ఉద్యోగంలో సెటిలయ్యాను. వుండేది వైజాగులోనే కాబట్టి మా స్నేహం అలా కొనసాగుతూనే వుండేది. మా కేంద్రస్థానం నా రూమ్. సాయంత్రం ఆరయ్యేసరికి, సుందరంతోపాటు మిగతా మిత్రులూ అక్కడికే చేరుకునేవారు. అలాంటి ఒక సాయంకాలం మా చర్చలు ఉద్వేగభరితంగా సాగుతున్నాయి.

''ఎగ్జిస్టెయన్సీ మెటీరియలిజమైనా, కమ్యూనిజమైనా, ఏ ఇజమైనా మానవాళి మనుగడకు సహాయపడాలేతప్ప మారణహోమంగా మారకూడదు. ఇజాల గురించి, నిజాలగురించి థియరీలు ప్రవచించడంకన్నా ప్రాక్టికల్‌గా ఆలోచించడం, ఆచరించడం అదీ ముఖ్యం... కానీ... అలా ప్రవాహంలా వస్తున్న సుందరం మాటలు అప్రయత్నంగా ఆగిపోయాయి. అతని చూపులు కిటికీ దగ్గరే నిలిచిపోయాయి. నేను తలతిప్పి చూసేసరికే కిటికీ అవతల కరుణ - గుండ్రటి ముఖం, చిన్ని బొట్టు, ముఖంలో నైర్మల్యం. మల్లె మొక్కకు నీళ్ళు పోస్తున్న ఆమెను చూస్తూ ఎవరూ? అంటూ నన్నే ప్రశ్నించాడు సుందరం.

''ఆమె తల్లి పూర్వాశ్రమంలో ఒక నాటి నటిన, పబ్లిక్ రోజా... అర్థమయిందా?'' అన్నాడు ప్రతాప్.

నేను ఆ అమ్మాయి తల్లి గురించి అడగలేదే! అని కోపం తెచ్చుకోబోయాడు సుందరం.

''మిత్రమా యథా తల్లి, తథా పిల్ల, ఆ పిల్లకు పెళ్ళి చేద్దామనే తల్లి ప్రయత్నం, అయినా చెడిపోయినదాని కూతుర్ని చేసుకునే అంత ప్రబుద్ధుడు ఎవరొస్తాడు! అని వెటకారంగా మాట్లాడాడు ప్రతాప్.

మనం ఇంతవరకూ చర్చించిన విషయాలను మర్చిపోయి మరీ దారుణంగా మాట్లాడుతున్నావేరా అన్నాడు సుందరం బాధపడుతూ.

''సిద్ధాంతాలు వేరు, ఆచరణ వేరు, ఆల్ దట్ వుయ్ ప్రీచ్ కెనాట్ బి ప్రాక్టికబుల్ అన్నాడు ప్రతాప్ వాదనలోకి దిగుతూ.

''అదేంకాదు, నా విషయంలో మాత్రం'' శాంతంగా చెప్పాడు సుందరం.

''అంటే ఆ చెడిపోయినదాని కూతుర్ని నువ్వు ఉద్ధరించగలవా?'' అన్నాడు రెచ్చిపోతూ ప్రతాప్.

ఆ మాటలకు సుందరం తలొంచుకున్నాడు.

''అంతేలే బ్రదర్, తనదాకా వస్తేనేగానీ ఏదీ తెలీదు'' అంటూ ముక్తాయింపుగా నవ్వి, లెటజ్ మూవ్ అంటూ బయలుదేరాడు మా అందర్నీ తీసుకుని ప్రతాప్ బయటకు. తర్వాతి రోజునుంచి సుందరం మాకు కనిపించలేదు. కొన్ని రోజుల విరామం తరువాత ప్రత్యక్షమయ్యాడు శుభలేఖలతో. అవి కరపత్రాల్లా వున్నాయి.

''వివాహం భౌతిక అవసరమేకాదు. సామాజిక బాధ్యతకూడా. మేం వివాహం చేసుకుంటున్నాం. మిమ్మల్ని ఆహ్వానిస్తున్నాం''

- కరుణ, సుందరం

మా ఆశ్చర్యానికి అవధులు లేవు. సుందరం ఇంట్లోవాళ్ళు అతి కష్టం మీద ఒప్పుకున్నారు. తల్లి ఎలాంటిదయితేనేం, పిల్ల మాత్రం బంగారం. పైగా గ్రాడ్యుయేటు. అందం, సంస్కారం వున్న అమ్మాయి అని కొంతమంది సుందరం నిర్ణయాన్ని బలపరిచారు. నేను, మరికొంతమంది మిత్రుల సమక్షంలో రిజిస్ట్రార్ ఆఫీసులో పెళ్ళయిపోయింది. కొద్దిరోజులకు మా వూరికి దగ్గరలోనే ఒక డిగ్రీ కాలేజీలో అసిస్టెంట్ ఉద్యోగం రావడంతో [illegible]

సుందరంలాంటి సన్నిహితుల్ని, ఆ జ్ఞాపకాల్ని వదల్లేక వదిలి వచ్చేశాను. వారి గురించిన విశేషాలు ఉత్తరాలద్వారా తెలిసేవి. సుందరం, కరుణల సంసారం చాలా సంతోషంగా సాగుతోందనీ, మనసు, వాక్కు, శరీరం అనే మూడింటి సాక్షిగా ముడిపడ్డ దంపతులకన్నా, ఆ మూడు ముళ్ల ప్రసక్తి లేకుండా మనసులతోనే ముడివేసుకున్న వాళ్లిద్దరినీ 'మేడ్ ఫర్ ఈచ్ అదర్' అని సత్కరించవచ్చుననీ, మా మిత్రబృందంలోని ప్రతాప్ రాశాడు నాకు సంవత్సరం క్రితం, ఆ తర్వాత వారినుంచి సమాచారం లేదు.

మరి ఈ ఉత్తరం?!! నాకు మనసులో ఎన్నో ప్రశ్నలు. సుందరం మారిపోయాడా? ఏ రకమైన మార్పో, వారి సన్నిహిత మిత్రుణ్ణి కాబట్టి ఆ మనసుల మధ్య రగులుకుంటున్న అంతర్యుద్ధాన్ని ఆపాలి అనుకుంటూ బయలుదేరాను.

★ ★ ★

సుందరం ఇంటిముందు ఆటో దిగాను. మనసులో అలజడి. నన్నుచూసి ఏ విధంగా రియాక్టవుతాడో అనుకుంటూ భయంగానే అతని ఇంటి తలుపు తట్టాను. ఎదురుగా కరుణ. ఆమె కళ్లు ఏడ్చి ఉబ్బినట్లున్నాయి. కళ్లలో ఇదివరకటి వెలుగులేదు. జీవిత భారం అంతా తానే మోస్తున్నట్లుగా అలసటగా, ఆందోళనగా వుందామె. కూర్చోండి అంటూ లోపలకెళ్లింది. ''రజని రక్షించింది సుబ్రహ్మణ్యా! ఎప్పుడో నేను అన్యాయం చేస్తున్నట్లు. లోపలనుంచి అతను కోప్పడుతున్న సుందరం కంఠంలో తీవ్రత. నమ్మలేకపోతున్నాను. వివాహ వ్యవస్థ కల్పించిన కట్టడిలో, దాని పరిధిలో స్త్రీలు ఎదుర్కొనే సమస్యల్ని గుర్తించి వారి విముక్తికై పిలుపునిచ్చిన 'చలాన్ని' ఆరాధించిన సుందరం ఈ రకంగా మారడం నాకు అమితమైన బాధను కలుగజేస్తోంది. కళ్లు రెండూ రుద్దుకున్నాను. సుందరం ప్రత్యక్షం. పోల్చుకోలేకపోయాను. బాగా చిక్కిపోయాడు. మాసిపోయినగెడ్డం. మొహం ఉబ్బి కళ్లకింద నల్లటి వలయాలు. నేనేదో చెప్పబోయేంతలో -

''మిత్రమా నన్నేమీ అడగొద్దు. నాకేమీ నీతిబోధనలు చెయ్యొద్దు. నన్నిలా వదిలెయ్. అతను తూలుకుంటూ బయటకు వెళ్లిపోయాడు. మాటలు రాక నిర్లిప్తంగా కూర్చుండిపోయాను. ఆమె కళ్లు తుడుచుకుంటూ వచ్చింది. ''ఆరు

## నీతి

''మొగుణ్ణి పెళ్లయిన మర్నాటినుంచే మన అదుపులో వుంచుకోవాలి'' కొత్త పెళ్లికూతురికి 'నీతులు' చెప్పడం ప్రారంభించింది సౌభాగ్యమ్మ.

''ఎందుకు?'' అమాయకంగా అడిగింది కొత్త పెళ్లికూతురు.

''ఇప్పుడు నువ్వే అన్నావ్‌గా మీ ఆయన ఏదో సిగరెట్లు తాగుతారని. మా ఆయనకి ఆ చెడు అలవాటు వుండేది. పెళ్లయిన మర్నాడే ఆ అలవాటు మానమని ఖచ్చితంగా చెప్పేశాను''

''మానేశారా?'' కుతూహలంగా అడిగింది కొత్త పెళ్లికూతురు.

''ఏమో... నేనాయన్ని చూసి పదేళ్లయింది!''

- పి.ఆర్. బద్దిగం, కరీంనగర్



నెలలనుంచి అదోలా వుంటున్నారు. క్రమేపీ సిగరెట్లు, త్రాగుడు అలవాటయ్యాయి, అన్నీ భరించాను. ఇంకా నేను ఆమె మాటలు వినలేకపోయ్యాను. ఆమె కంఠం వణుకుతోంది. నేనింకా అక్కడుంటే ఆమె దుఃఖం ఎక్కువవుతుందని వచ్చేశాను. ఆమె భోజనం చేయమని ప్రాధేయపడినా మా వైజాగు మిత్రులతో కలిసి సుందరంలో మార్పు తేవడానికి విశ్వప్రయత్నం చేశాను. అయినా లాభంలేకపోయింది. మాకు కనిపించకుండా తప్పించుకుని తిరిగాడు. ఇక చేసేది లేక కాలంతోపాటు అతనూ మారగలడని నేను అతన్ని పూర్తిగా మర్చిపోయాను.

★ ★ ★

రెండు నెలల తర్వాత ఒక పిడుగులాంటి వార్త. సుందరం చనిపోయాడని. అతని ఆఖరి చూపులు నాకు దక్కలేదు. చనిపోయిన నెల తర్వాత తెలిసింది. తన అంతిమ కోర్కెగా కరుణ మళ్లీ పెళ్లి చేసుకోవాలని. ఆ భారం మిత్రులదేనని ఉత్తరం రాసిపెట్టాడుట. అతనెప్పుడో తన కళ్లను ఐబాంక్‌కి డొనేట్ చేశాడు. ఆ విషయం మాత్రం అమలు జరిగింది. కానీ కరుణకు మళ్లీ పెళ్లి చేయడం మా మిత్రుల తరం కాలేదు. నేను ఒకసారి వెళ్లి ఆమెకు నచ్చచెప్పాను. ఆమె తల్లికూడా కరుణకు మళ్లీ పెళ్లి చేయడానికి ప్రయత్నించింది. పిల్లలున్న రెండో పెళ్లివాళ్లు, వయసు పైబడి పెళ్లికానివాళ్లు ఆమెను పెళ్లిచేసుకోవడానికి సిద్ధపడ్డారు. అయినా ఆమె అంగీకరించలేదు. నర్స్ ట్రైనింగ్‌లో జాయినయింది. ఆమె విషయంలో మేం చెయ్యగలిగిందేమీ లేదని అర్థమవడంతో మా ప్రయత్నాలను ఆపేశాము.

కాలచక్రంలో మరో సంవత్సరం గడిచింది. ఒక కాలేజీల్లో నన్ను ఎగ్జామినర్‌గా వేయడంతో నాకు విశాఖపట్నం ప్రయాణం తగిలింది. నా పని ముగించుకున్న అనంతరం నేను చేసిన మొదటి పని 'కరుణ' గురించి వాకబు చేయడం. ఆమె తన నర్స్ ట్రెయినింగ్ పూర్తయిన తర్వాత లెప్రసీ హాస్పిటల్‌లో చేరిందని మా మిత్రులు చెప్పేరు. దానికి సూపరింటెండెంట్ డాక్టర్ జయరావు. ఆయన సుందరానికి అతి సన్నిహిత మిత్రుడు. ఆయన్ని వెంటనే కలిశాను. ఆమె క్షేమ సమాచారాలు అడిగిన తర్వాత ఆమెను పెళ్లికి ఒప్పించాలి డాక్టర్ అన్నాను.

''ఆమె ఒప్పుకోదు, నేను చాలా ప్రయత్నించాను. మా హాస్పిటల్‌లోనే తన కాలం అంతా గడిపేస్తోంది. ఆమె సుందరం జ్ఞాపకాల్లోనే బ్రతుకుతోంది. జీవితాంతం అలానే వుండిపోతుందేమో పిచ్చితల్లి....'' అన్నాడాయన నిట్టూర్పు విడుస్తూ-

''ఏం జ్ఞాపకాల్లెద్దురూ, లవ్ ఎట్ ఫస్ట్ సైట్‌లో పెళ్లి చేసుకున్నా ఆమెకు అతడు కలిగించిన మానసిక సంక్షోభం నేనెరుగుదును, అతణ్ణి శాశ్వతంగా మరచిపోవడమే మంచిది... అన్నాను. నా మాటలకు వెంటనే ఆయన స్పందిస్తూ ''లేదు రాజూ, మీకందరికీ సుందరం ఒక పతనం చెందిన ఆదర్శవాదిలా కనిపించాడు కానీ...'' అంటూ ఆయన ఆగిపోయాడు.

ఆయన ఏదో దాస్తున్నాడనిపించి, చెప్పండిసార్, అసలు విషయం అంటూ నేను బలవంతం చేశాను. సుందరంలో హఠాత్తుగా మార్పు రావడానికి కారణం అతడికొచ్చిన జబ్బు... అన్నాడు.

''మైగాడ్...'' అన్నాను ఆందోళనగా... ఆయన కొనసాగించాడు. నాకు తెలీకుండానే మద్రాసు వెళ్లి చూపించుకున్నాడు. డబ్బు ఖర్చుపెట్టి. వైద్యం చేయించుకున్నా లైఫ్‌స్పాన్ కొద్దికాలం పెరుగుతుంది తప్ప చావు తథ్యం అని అక్కడి డాక్టర్లు

చెప్పారు. చనిపోయే విషయం ముందే తెలిస్తే ఆమె భరించలేదని అతడికి తెలుసు. అందుకే ఆమెకో పీడకలగా మారిపోవడానికి, తాను ఏ విలువలకై ప్రాకులాడాడో అదే విలువల్ని కాలరాచాడు. కరుణకు తనపట్ల ద్వేషం పెరిగితే ఆమె వేరొకరికి తన మనసులో చోటివ్వగలదనే ఆశతో తన చివరి దినాల్లో ఆమెను దూరం చేసుకున్నాడు. ఆయన చెప్పడం పూర్తిచేసేసరికి నా కళ్లల్లో నీళ్లు నిలిచాయి. సుందరంపట్ల మనసంతా జాలితో నిండిపోయింది.

''ఈ విషయం అంతా మీకెలా తెలుసు డాక్టర్... అన్నాను.

''తనకొచ్చిన జబ్బుకు మందులువాడితే మరికొన్ని రోజులు బ్రతికేవాడేమో - ఆమె మళ్లీ పెళ్లిచేసుకోవాలనీ, ఆమె జీవితం హాయిగా సాగాలనీ, అందుకే దురలవాట్లకు బానిసై తన చావును ప్రీపోన్ చేసుకున్నానని, ఈ విషయం కరుణకు తెలియనీయవద్దనీ, తను ఇంకో పది రోజుల్లో చనిపోతాడనగా నాకు తెలియజేశాడు. అప్పటికే ఆలస్యమైపోయింది. పరిస్థితి చెయ్యి దాటిపోయింది. నేనేమీ చేయలేకపోయాను. అతను చనిపోయేరోజుల్ని లెక్కించడం తప్ప...

ఆయన మాటలువింటుంటే నాకు దుఃఖం ఆగడంలేదు.

''ఆమెను మా ఆసుపత్రిలో నర్స్‌గా తీసుకోవడం తప్ప నేనామె పెళ్లి చేయ:లేకపోయాను. డాక్టర్ గారి స్వరంలో ఆవేదన.

ఆయననుంచి సెలవుతీసుకుని కరుణ పనిచేస్తున్న ఆ ఆసుపత్రిలోని వార్డ్‌వైపు నడిచాను. అప్పుడు సమయం ఏడయింది. వాతావరణంలో ప్రశాంతత. అయినా నా మనసులో అర్థంకాని గుబులు. నాకు కొద్ది దూరంలో కరుణ. తెల్లటి మల్లెపూవులాంటి డ్రెస్సులో - ఆ వస్త్రాల్లో ఆమె దీనుల బాధల్ని దూరం చేసే దేవతామూర్తికి ప్రతిరూపంలా వుంది. ఆమెకు ఎదురుగా వ్యాధిగ్రస్తుడైన ముసలి వ్యక్తి. అతని ముఖం వికృతంగా వుంది. వేళ్లు లేని అతడి చేతులకు ఆమె మందు రాస్తోంది. ఆ పనిని నిష్టగా, తపస్సులా చేస్తున్న ఆమెను ఆ స్థితిలో మాట్లాడించడం ఇష్టంలేక గబగబా వచ్చేశాను. సుందరం మరోసారి మనస్సులో మెదిలాడు. అందరూ వెలివేసిన పతితురాలైన ఒక తల్లి కడుపున పుట్టిన కరుణను పెళ్లిచేసుకున్నాడు. కాలం కలిసిరాక ఆమెకు దూరమై ఆమె జీవితం మోడువారకుండా వుండడానికి తాను చరిత్రహీనుడిగా ముద్ర వేయించుకున్నాడు. అలాంటి సుందరం సమాజాన్ని అమితంగా ప్రేమించాడు. తన కళ్లను దానం చేయడంద్వారా తన ప్రేమను ప్రపంచానికి బయల్పరచాడు. సుందరం ప్రేమించిన సమాజాన్నే ఆమె ప్రేమిస్తోంది. అదే స్మృతిలో ఆమె కాలం గడుపుతోంది. అదే ఆమె అతడికి సమర్పించే శ్రద్ధాంజలి.

కవి చెప్పినట్లు ''వెళ్లిపోయిన వాళ్లను గుర్తుపెట్టుకోవడం ఒక వేడుక కాదు, ఒక యాగం - ఒక సుదీర్ఘ యుద్ధాన్ని కొనసాగించడం...''

(ఈ కథ రాయడానికి తన కవితలద్వారా నాకు స్ఫూర్తినిచ్చిన కె. శివారెడ్డిగారికి ఈ కథ అంకితం).